## బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త పనిచేయాలి



కవాడిగూడ డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ

కవాడిగూడ, అక్టోబర్ 31 : ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యాం యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా హాజరైన జైసింహ మాట్లాడుతూ.. పార్టీలో వ్యక్తిగత విభేదాలకు వెళ్లకుండా ప్రతి కార్యకర్త, నాయకుడు బీఆర్ఎస్ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.సాయికృష్ణ, సీనియర్ నాయకులు వల్లాల శ్రీనివాస్, శ్రీహరి, ఆర్.రాజేష్, గొల్లగడ్డ రాజశేఖర్‌గౌడ్, కరికె కిరణ్ కుమార్, రామచందర్, వల్లాల రవియాదవ్, విశ్వనాథ్, మహిళా నాయకురాలు మాధవి, రూప, మధు, టి.ప్రభాకర్, దుర్గ స్వామి పాల్గొన్నారు.

## మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజాభివృద్ధి

- జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి



భోలక్‌పూర్ యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న జిల్లాశాఖ వైద్యాధికారి డాక్టర్ వెంకటి

కవాడిగూడ, అక్టోబర్ 31 : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి అన్నారు. ఈ మేరకు మంగళవారం భోలక్‌పూర్, ముషీరాబాద్, ప్రభుత్వ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలు, అందుతున్న మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఆరోగ్య మహిళ' కార్యక్రమం విజయవంతంగా కొనసాగేలా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అన్నారు. ప్రతి మంగళవారం మహిళలకు మాత్రమే ప్రత్యేక వైద్య పరీక్షలు చేసే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. డాక్టర్ దీప్తి ప్రియాంక, డాక్టర్ మెహరూన్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## పోలీసులకు సీపీ అభినందన..



ముషీరాబాద్ పోలీసులను అభినందించిన పోలీసు కమిషనర్ సందీప్‌శాండిల్య

ముషీరాబాద్, అక్టోబర్ 31: హత్య, మతపరమైన అల్లర్ల కేసుల్లో నిందితులుగా ఉండి నాలుగేళ్లుగా పోలీసుల కళ్లుకప్పి తిరుగుతున్న ఇద్దరిని చాకచక్యంగా పట్టుకున్న ముషీరాబాద్ పోలీసులను మంగళవారం నగర పోలీసు కమిషనర్ సందీప్‌శాండిల్య అభినందించారు. ముషీరాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో పలు కీలక కేసుల్లో మహ్మద్ మోయినుద్దీన్, మహబూబ్ నిందితులుగా ఉన్నారు. ఇద్దరు నిందితులు తప్పించుకు తిరుగుతుండగా ముషీరాబాద్ పోలీసులు వలపన్ని ఒకరిని కర్ణాటక, మరొకరిని పటాన్‌చెరులో అదుపులోకి తీసుకున్నారు. నిందితులిద్దరిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జాహంగీర్ యాదవ్, డీఐ వెంకటరెడ్డి, ఎస్ఐలు ప్రసాదరెడ్డి, చలపతిరెడ్డి, ప్రేమ్‌కుమార్, సిబ్బంది కిశోర్, ప్రకాశ్, సాయికుమార్‌లను పోలీసు కమిషనర్ అభినందించి రివార్డు అందించారు.

# ఐదు దశాబ్దాల సమస్యకు మోక్షం

- రూ. 12.50కోట్లు వెచ్చించి ప్రహరీ నిర్మాణం, నాలా విస్తరణ
- రెండు బస్తీలకు తప్పిన వరద ముప్పు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



నాలాకు ఇరువైపులా నిర్మించిన ప్రహరీ

ముషీరాబాద్, అక్టోబర్ 31: ఐదేళ్లలో ఆ రెండు బస్తీలకు వరద ముంపు సమస్య తొలగిపోయింది. వానొస్తే వణికిపోతూ కట్టుబట్టలతో ఇళ్లపైకి చేరుకునే పరిస్థితి పోయింది. తెలంగాణ సర్కార్ ప్రత్యేక దృష్టితో వరద సమస్యకు పరిష్కారం చూపడటంతో రెండు బస్తీల వాసులు గత యేడాది కాలంగా వరదనీటి ముంపు సమస్య దూరమయ్యారు. నగర నడిబొడ్డున ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్ సాయిచరణ్ కాలనీ, నాగమయ్యకుంట బస్తీల పరిస్థితి నేడు పూర్తిగా మారిపోయింది.

**నాటి పరిస్థితి...**

అడిక్‌మెట్ డివిజన్ నాగమయ్యకుంట, సాయిచరణ్ కాలనీలు దశాబ్దాలుగా వరద నీటి ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఓ మోస్తరు భారీ వర్షం కురిస్తే చాలు వరద నీరు రెండు బస్తీలను ముంచెత్తుతూ ఇళ్లల్లోకి చేరుతుంది. అర శతాబ్దానికిపైగా నాలాకు ఇరువైపులా నివసిస్తున్న వారు వరద నీటి సమస్యతో తీవ్ర ఇక్కట్లు పడుతూ వస్తున్నారు. సికింద్రాబాద్, గాంధీఆసుపత్రి తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరద, మురుగు నీరు వెళ్లే ప్రధాన నాలా నాగమయ్యకుంట, సాయిచరణ్‌కాలనీ, పద్మకాలనీల మీదుగా సాగర్ నాలాలో కలుస్తుంది. విద్యానగర్-వీఎస్‌టీ ప్రధాన రోడ్డు కింద ఏర్పాటు చేసిన తూములు ఇరుకుగా ఉండటంతో వరద నీరు సాఫీగా వెళ్లలేని పరిస్థితి ఉండేది. దీంతో భారీ వర్షం కురిస్తే పెద్ద ఎత్తున వరద నీరు నాలాకు ఇరువైపులా ఉన్న ఇళ్లల్లోకి చేరుతుంది. దీంతో నాగమయ్యకుంట, సాయిచరణ్ కాలనీ వాసులు కట్టు బట్టలతో బ్రతుకు జీవుడా అంటూ ఇళ్ల పైకి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేవారు. వరద తగ్గిన తరువాత తిరిగి ఇళ్లకు చేరుకొని బురద శుభ్రం చేసుకునేవారు. ఇలా కొన్ని వందల సార్లు రెండు బస్తీలను వరద నీరు ముంచెత్తడం, అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చి చూసి వెళ్లడం, తాత్కాలికంగా నిత్యావసరాలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు.



గతంలో వచ్చిన వరదలకు కూలిన నాలా ప్రహరీ

**నేడు శాశ్వత పరిష్కారం...**

నాగమయ్యకుంట వద్ద ఇరుకుగా ఉన్న తూములను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో బ్రిడ్జి నిర్మాణం, పద్మకాలనీలో బాటిల్ నెక్‌లా(ఇరుకుగా ఉన్న) నాలాను వెడల్పు చేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. అంతేకాదు గత రెండేళ్ల క్రితం నాలాకు ఇరువైపులా రూ. 50 లక్షల వ్యయంతో పటిష్ట ప్రహరీ నిర్మాణం, ఇటీవల రూ. 12 కోట్ల వ్యయంతో తూముల విస్తరణతోపాటు రెండు చోట్ల నాలాపై బ్రిడ్జి నిర్మించారు. ఇప్పటి వరకు ఉన్న నాలుగు మీటర్ల తూములు, నాలాను 12 మీటర్ల మేర విస్తరించి పై నుంచి వాహనాలు వెళ్లేలా బ్రిడ్జిలు నిర్మించారు. దీంతో సాయిచరణ్ కాలనీ, నాగమయ్యకుంట వరద ముంపు సమస్య పూర్తి స్థాయిలో తొలగిపోగా పద్మకాలనీకి యాభై శాతం మేర వరద ముంపు సమస్య తప్పినట్లైంది. దాదాపు 300 కుటుంబాలు వరద ముంపు సమస్య నుంచి బయటపడ్డాయి.

### వరద సమస్య లేకుండా చేశాం



సాయిచరణ్ కాలనీ, నాగమయ్యకుంట బస్తీలకు వరద సమస్య తలెత్తకుండా నాలాకు వైపులా పటిష్టంగా ప్రహరీ నిర్మించాం. రోడ్డు కింది భాగంలో ఉన్న తూములను విస్తరించి, వంతెన నిర్మించడం ద్వారా వరద సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. గతంలో చాలా మంది ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చి వరద సమస్యను పట్టించుకోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో రెండు బస్తీల వరద సమస్యను పరిష్కరించగలిగాం.

– ముఠా గోపాల్, ఎమ్మెల్యే అభ్యర్థి

## అలరించిన సినీ సంగీత విభావరి



ఎస్ రామచందర్‌రావుకు పురస్కారాన్ని అందజేసిన గాయని ఆమని, రాజన్ ఫల్గుణ

ముషీరాబాద్, అక్టోబర్ 31: రాజన్ సప్తస్వరాలు సీజన్-8 కార్యక్రమం పేరిట మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి విశేషంగా అలరించింది. ప్రముఖ గాయని ఆమని, రాజన్ సప్తస్వరాలు సంస్థ నిర్వాహకుడు రాజన్ ఫల్గుణ ఆధ్వర్యంలో ఆలపించిన మధుర గీతాలు రంజింప చేశాయి. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత, లయన్ డాక్టర్ ఎస్ రామచందర్‌రావుకు కళా కిరీటి పురస్కారాన్ని అందచేసి ఘనంగా సత్కరించారు.

## నేడు గాంధీనగర్‌లో ముఠా గోపాల్ ప్రచారం

చిక్కడపల్లి, అక్టోబర్ 31: గాంధీనగర్ డివిజన్ బాపునగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం వద్ద నుంచి బుధవారం ఉదయం 8 గంటలకు బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ ఎన్నికల ప్రచారం ప్రారంభం అవుతుందని పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్ తెలిపారు. ఈ ప్రచారానికి అభ్యర్థి ముఠా గోపాల్, ఎన్నికల ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ప్రభాకర్, ముఠా జయసింహ హాజరు కానున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## 'కాలం మింగిన కలం'పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

రవీంద్రభారతి,అక్టోబర్ 31: లేఖిని రచయిత్రుల వేదిక నిర్వాహణలో రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి రచించిన 'కాలం మింగిన కలం' పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్తలూరి విజయలక్ష్మి తన తండ్రి జ్ఞాపకార్థం కాలం మింగిన కలం పుస్తకాన్ని రచించి అంకితం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. తన తండ్రిపై ప్రేమతో విజయలక్ష్మి ఇంత మంచి పుస్తకాన్ని రాయడం సమాజంలో ఆమెకు మంచి గుర్తింపు రావాలని ఆయన ఆకాంక్షించారు. విజయలక్ష్మి భవిష్యత్‌లో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. సభాధ్యక్షుడిగా డాక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు, అత్తలూరి గంగాధర్‌రావు, డాక్టర్ మంథా భానుమతి, శీలా సుభద్రాదేవి, ఉదయగిరి రాజేశ్వరి, గంటి భానుమతి, అల్లూరి గౌరీలక్ష్మి, టి. గౌరీశంకర్ పూర్వ తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

## కందుకూరి వినుతకు డాక్టరేట్..





ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ ఎంట్రప్రెన్యూషిప్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కాచిగూడలోని బిద్రుక కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కందుకూరి వినుతకు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో వైస్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణ్ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కార్యదర్శి, డైరెక్టర్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు వినుతను అభినందించి సన్మానించారు.

– కాచిగూడ, అక్టోబర్ 31